## క్లుప్తంగా

### వైఎస్సార్‌సీపీ పోరుబాట జయప్రదానికి పిలుపు

**ఆత్మకూరు:** కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమాన్ని ఆత్మకూరులో శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు మేకపాటి కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నేతృత్వంలో ఉదయం 10 గంటలకు పట్టణంలోని ఎంజీఆర్ మున్సిపల్ బస్టాండ్ నుంచి విద్యుత్ శాఖ డీఈఈ కార్యాలయం వరకు ర్యాలీ జరుగుతుందని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

### గొంతువాపు నివారణకు టీకాలు

**వరికుంటపాడు:** మండలంలోని పెద్దిరెడ్డిపల్లి, వరికుంటపాడు పశువైద్యశాలల పరిధిలో రెండు సంవత్సరాల వయస్సు కలిగిన పశువులకు గొంతు వాపు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నట్లు ఇన్‌చార్జి పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలకు పశువులకు గొంతువాపు లేదా గురక లేదా పచ్చిక దొమ్మ వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఉచితంగా వేస్తున్న గొంతువాపు వ్యాధి నివారణ టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### నాణ్యమైన భోజనం అందించండి



**ఉదయగిరి:** ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి సూచించారు. మండలంలోని సర్వరాబాదు, నేలటూరు ప్రాథమిక పాఠశాలలను గురువారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూసి నాణ్యతను పరిశీలించారు.

### విద్యావనరుల కేంద్రంలో తనిఖీలు



**వింజమూరు(ఉదయగిరి):** వింజమూరు మండల విద్యావనరుల కేంద్రాన్ని ఏపీసీ డీ వెంకటసుబ్బయ్య గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను ఎంఈఓను అడిగి తెలుసుకున్నారు. మనబడి–మన భవిష్యత్ కార్యక్రమంపై ఆరా తీశారు. అనంతరం ఏపీసీను ఎంఈఓ కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఎంఈఓ మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది మౌనిక, శ్రీహరి ఉన్నారు.

### మేకపాటి పరామర్శ



**మర్రిపాడు:** మండలంలోని చాబోలుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పుట్టం అంకయ్య పెద్ద కుమారుడు పుట్టం శ్రీనివాసులు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో పుట్టం కుటుంబ సభ్యులను ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాలరెడ్డి గురువారం పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

### యూటీఎఫ్ మోడల్ టెస్ట్ పేపర్ల ఆవిష్కరణ




**వరికుంటపాడు:** మండలంలోని పెద్దిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ పదో తరగతి మోడల్ టెస్ట్ పేపర్లను హెచ్‌ఎం ఎల్ చలపతి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఆంగ్ల ఉపాధ్యాయులు రావిళ్ల నాగార్జున దాతృత్వంతో 40 మంది విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లను అందజేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు శ్రీహరి , గోపి , జలీల్ సుల్తాన్ పాల్గొన్నారు.

### మున్సిపల్ పారిశుధ్య కార్మికుల నిరసన

**కావలి:** స్థానిక మున్సిపల్ కారాలయం ఎదుట మున్సిపల్ పారిశుధ్య కార్మికులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఒప్పందాలను ఇప్పటి వరకు ప్రభుత్వం అమలు చేయలేదని తెలిపారు. కార్మికులకు ప్రమాద బీమా రూ.7 లక్షలు, దహన సంస్కరణలకు రూ.20వేలు, ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పొడిగించాలని, దినసరి కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కొబ్బరి నూనెలు, సబ్బులు, ఇతర వస్తువులను ఇవ్వాలన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

# కూటమి షాక్

విద్యుత్ వినియోగదారులకు కూటమి ప్రభుత్వం షాకిస్తోంది. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, అవసరమైతే ఇంకా తగ్గిస్తామని నమ్మబలికిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడవక ముందే మాట తప్పారు. సర్దుబాటు చార్జీల పేరిట బాదుడుకు సిద్ధమయ్యారు. చలికాలంలో విద్యుత్ వినియోగం తగ్గుతుంది. అందుకనుగుణంగా బిల్లులు తగ్గాలి. కానీ అందుకు భిన్నంగా గత నెల కన్నా ఈ నెల బిల్లులు మోతమోగడంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు. ఇక వేసవి వేస్తే బిల్లులు ఏ మేర వస్తాయోనని ఆందోళన చెందుతున్నారు.



కావలి ప్రజలపై రూ.3.86 కోట్ల మేర భారం

- విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం
- సర్దుబాటు చార్జీల పేరిట బాదుడు
- యూనిట్‌పై రూ.1.50 చొప్పున పెరుగుదల

నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట

**కావలి:** కావలి నియోజకవర్గంలో కావలి టౌన్‌తో పాటు కావలి రూరల్, దగదర్తి, అల్లూరు, బోగోలు మండలాల పరిధిలో గృహ, కమర్షియల్, ఆక్వాకు సంబంధించి 1,03,129 కనెక్షన్లు ఉన్నాయి. వాటికి సంబంధించి ప్రతి నెలా 2,56,90,765 యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోంది. అందుకు సంబంధించి వినియోగదారుల నుంచి ప్రతి నెలా రూ.9,99,82,780 వసూలు చేస్తున్నారు. ఈ మొత్తం చెల్లింపుల్లో జాప్యానికి సంబంధించిన వడ్డింపులు కాకుండా వసూలు చేసేది మాత్రమే. కావలి నియోజకవర్గంలో గృహ కనెక్షన్లు 88,420 కనెక్షన్లు ఉండగా, నెలకు సరాసరిన 84,03,114 యూనిట్లు వినియోగిస్తున్నారు. ఇందుకు సంబంధించి రూ.4,24,67,598ను బిల్లులు రూపంలో వసూలు చేస్తున్నారు. అలాగే వ్యాపార కనెక్షన్లు 10,551 ఉండగా, నెలకు సరాసరిన 1,02,92,028 యూనిట్ల వినియోగం ఉంది. ఇందుకు సంబంధించి రూ.2,70,75,799 వసూలు చేస్తున్నారు. ఆక్వాకల్చర్‌కు సంబంధించి 1,647 కనెక్షన్లు ఉండగా, నెలకు సరాసరిన 63,95,460 యూనిట్ల వినియోగం ఉంది. అందుకు సంబంధించి రూ.2,08,99,843 వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల వీధిదీపాలకు సంబంధించిన కనెక్షన్లు 2,511 ఉండగా, నెలకు సరాసరిన 6,00,163 యూనిట్లు వినియోగం జరుగుతోంది. అందుకు సంబంధించి రూ.95,39,540 చెల్లించాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వం విద్యుత్ సర్‌చార్జీల పేరుతో నవంబర్‌లో రూ.6,072.86 కోట్లు, డిసెంబరులో రూ.9,412.50 కోట్లు కలిపి మొత్తం రూ.15,485.36 కోట్ల భారాన్ని వినియోగదారులపై మోపేందుకు సిద్ధమైంది. ఈ లెక్కన వినియోగదారులపై సర్‌చార్జీల రూపంలో సగటున యూనిట్‌పై రూ.1.50 అదనంగా భారం పడనుంది. కావలి నియోజకవర్గంలో నెలకు సరాసరిన 2,56,90,765 యూనిట్లు వినియోగిస్తుంటే, అందుకు నెలకు రూ.10 కోట్లపైగా బిల్లుల రూపంలో వసూలు అవుతున్నాయి. ఈ లెక్కన కావలి నియోజకవర్గ ప్రజలపై అదనంగా రూ.3.86 కోట్ల భారం పడనుంది. అంటే ఇప్పటి వరకు చెల్లిస్తున్న రూ.10 కోట్లకు అదనంగా రూ.3.86 కోట్లు కలిపి రూ.13.86 కోట్లను విద్యుత్ చార్జీల రూపంలో ప్రజలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన అదనపు చార్జీలు, జరిమానాలు లేకుండా నెలకు రూ.3.86 కోట్ల వంతున ఏడాదికి రూ.46.32 కోట్లను అదనంగా సమర్పించుకోవాల్సి ఉంటుంది.

**ఉదయగిరి:** ఉదయగిరి నియోజకవర్గంలో కలిగిరి, ఉదయగిరి ఎస్‌పీడీసీఎల్ సబ్ డివిజన్లు ఉన్నాయి. ఉదయగిరి సబ్‌డివిజన్ పరిధిలో 55,576 విద్యుత్ సర్వీసులు ఉండగా, అందులో 40,471 గృహ, కమర్షియల్ సర్వీసులు ఉన్నాయి. మిగిలినవి వ్యవసాయ కనెక్షన్లు. కలిగిరి సబ్‌డివిజన్ పరిధిలో 30వేల గృహ, కమర్షియల్ సర్వీసులు ఉన్నాయి. గత నెలలో వర్షాలు, చలితో విద్యుత్ వినియోగం తగ్గింది. అందుకనుగుణంగా విద్యుత్ బిల్లులు తగ్గాల్సి ఉంది. కానీ పెరిగిన విద్యుత్ చార్జీలతో బిల్లులు కొందరికి గత నెలలో మాదిరిగానే రాగా, మరికొందరికి పెరిగాయని వినియోగదారులు చెబుతున్నారు.




### మోసం చేసిన సీఎం చంద్రబాబు



గత ఎన్నికల వేళ ప్రతిపక్ష నేతగా చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, ఇంకా తగ్గిస్తామని మోసపూరిత మాటలతో ప్రజలను నమ్మించారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడవక ముందే విద్యుత్ చార్జీలు పెంచి వినియోగదారుల నెత్తిన మోయలేని భారం మోపడం దారుణం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడమే కాకుండా సంపద సృష్టిస్తామని బీరాలు పలికి ఇప్పుడు ప్రజలను బాదుతున్నారు. విద్యుత్ చార్జీల భారాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ పోరుబాటకు పిలుపునిచ్చింది.

–మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

### అరచేతిలో వైకుంఠం చూపించారు



సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించారు. ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలని నోటికి వచ్చిన హామీలను ఇచ్చారు. కూటమి అధికారంలోకి వస్తే ప్రజలతో విద్యుత్ ఉత్పత్తి చేయించి అమ్మేలా చేస్తామని, విద్యుత్ చార్జీలను పెంచబోమని, తగ్గిస్తామని హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి ఆరునెలలు కూడా తిరగక ముందే సర్‌చార్జీల పేరుతో భారీగా ప్రజలపై భారం మోపేందుకు సిద్ధమయ్యారు. రాష్ట్ర ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ పోరుబాటకు పిలుపునిచ్చింది.

–రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కావలి.

## పీఏసీఎస్ ఖాతాల ఈకేవైసీని వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఏఎస్‌పేట ఎంపీడీఓ



కృష్ణారెడ్డిపాలెంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి

**అనుమసముద్రంపేట:** మండలంలో పీఏసీఎస్ ఖాతాలకు సంబంధించిన ఈకేవైసీని వేగవంతం చేయాలని ఎంపీడీఓ ప్రసన్నకుమారి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శ్రీకొలను గ్రామ సచివాలయం పరిధిలో సచివాలయ సిబ్బంది చేపడుతున్న పీఏసీఎస్ ఖాతాల ఈకేవైసీని గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 1852 మంది పీఏసీఎస్ ఖాతాలను ఈకేవైసీ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 1092 ఖాతాల ఈకేవైసీని పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన 760 ఖాతాల ఈకేవైసీని శుక్రవారంలోగా పూర్తి చేస్తామన్నారు. పీఏసీఎస్‌లో ఖాతాలు కలిగిన రైతులు సచివాలయ సిబ్బందిని సంప్రదించి ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. ఆమె వెంట ఈఓపీఆర్డీ రమేష్, పంచాయతీ కార్యదర్శి వినాయక్ ఉన్నారు.

**కలిగిరి:** మండలంలో పీఏసీఎస్ ఖాతాల ఈకేవైసీని పక్కాగా చేపడుతున్నామని ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి తెలిపారు. కృష్ణారెడ్డిపాళెం, వెలగపాడు సచివాలయాల పరిధిలో సచివాలయ సిబ్బంది చేపడుతున్న పీఏసీఎస్ సభ్యుల సర్వే, ఖాతాల ఈకేవైసీ కార్యక్రమాన్ని గురువారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలిగిరి, కుడుములదిన్నెపాడు, సిద్ధనకొండూరు పీఏసీఎస్ కేంద్రాల పరిధిలో 3,311 మంది సభ్యులు ఉన్నారన్నారు. మూడ్రోజుల్లో సభ్యుల సర్వే, ఈకేవైసీని పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

## ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



అల్లూరు: పురుగుమందుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏడీఏ నాగరాజు



కలిగిరిలోని మన గ్రోమోర్ కేంద్రంలో..

**అల్లూరు:** ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కావలి ఏడీఏ నాగరాజు హెచ్చరించారు. మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లను తనిఖీ చేసి ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా, పురుగు మందులను కొనుగోలు చేసిన రైతులకు ఖచ్చితంగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.ఎరువులను అమ్మిన వెంటనే ఈపాస్ మెషిన్‌లో క్లియర్ చేయాలని ఆదేశించారు. సొసైటీలలో రైతులకు యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు ఉన్నారు.

**కలిగిరి:** ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి సురేష్‌బాబు హెచ్చరించారు. కలిగిరి, వింజమూరులోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఎరువుల డీలర్లు యూరియాకు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు. ఎరువుల విక్రయాల్లో అవకతవకలకు పాల్పడితే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఒక రైతుకు యూరియా గరిష్ఠంగా 10 బస్తాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఎరువుల విక్రయాలను పీఓఎస్ యంత్రాల్లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఆయన వెంట వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

**బిట్రగుంట:** బోగోలు మండలంలోని ఎరువుల దుకాణాల్లో యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయశాఖాధికారిణి విజయలక్ష్మి హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ఎరువుల దుకాణాల్లో గురువారం ఆమె తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ సహాయకులను పర్యవేక్షకులుగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల అవసరాలను, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని యూరియాను ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరలకు విక్రయించినా, యూరియాతో పాటు ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేయాలనే నిబంధన విధించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వ్యాపారులు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే రైతులు నేరుగా తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

### కావలిలో ఓ మోస్తరు వర్షం



చేజర్ల: ఆదూరుపల్లిలో జోరుగా కురుస్తున్న వర్షం

**కావలి:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కావలి నియోజకవర్గంలో ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం అర్ధరాత్రి నుంచి మొదలైన వర్షాలు గురువారం కూడా కొనసాగాయి. వర్షం, చలిగాలులకు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. కాగా సముద్రం మీదుగా చల్లని గాలులు వీస్తుండడంతో తీరప్రాంత గ్రామాల్లోని మత్స్యకారులు తల్లడిల్లుతున్నారు.

**చేజర్ల:** మండలంలో గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వర్షంతో రబీ సాగు పనులు చేసుకుంటున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

### సరస్వతీదేవికి విశేష పూజలు



**సంగం:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని సరస్వతీదేవికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. వార్షిక వేడుకల్లో భాగంగా విగ్రహ నిర్మాణ దాతలు అమ్మవారిని పుష్పాలతో విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. హెచ్‌ఎం బుజ్జయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దాతలు విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పెంచలరెడ్డి దంపతులు పాల్గొన్నారు.

### పాఠశాలల్లో తనిఖీలు



**కావలి:** మండలంలోని చెన్నాయపాళెం పంచాయతీ పరిధిలోని పాముగుంటపాళెం, చెన్నాయపాళెం ఎస్సీ కాలనీలోని పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారి బీ గోవిందయ్య గురువారం తనిఖీ చేశారు. పాఠశాలల రికార్డులను పరిశీలించి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. మన బడి మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా నిర్మించాల్సిన తరగతి గదులపై పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులతో చర్చించారు. విద్యార్థుల డ్రాపవుట్స్ లేకుండా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు.

### గురుకులానికి షామియానా వితరణ

**ఆత్మకూరు:** పట్టణంలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలకు ప్రముఖ వైద్యురాలు డాక్టర్ షకీల రూ.50వేల విలువైన షామియానాను గురువారం వితరణ చేశారు. తన మనుమరాలు బొమ్మిరెడ్డి తారక్‌నాథ్‌రెడ్డి కుమార్తె శ్రేణ పుట్టినరోజును పురస్కరించుకుని బీఎస్సార్ ఫౌండేషన్ తరఫున షామియానాను అందజేశారు. తొలుత గురుకుల విద్యార్థుల సమక్షంలో కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ప్రిన్సిపల్ కామేశ్వరి, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు వీ శ్రీహరి, జేవీవీ కార్యదర్శి హరికృష్ణ, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందానీ పాల్గొన్నారు.

### వంగవీటి రంగాకు నివాళి



**కావలి:** పట్టణంలోని ట్రంక్‌రోడ్డులో వంగవీటి మోహనరంగా వర్ధంతిని ఆయన అభిమానుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పేదల కోసం నిత్యం పోరాటం చేసిన గొప్ప నాయకుడు రంగా అని కొనియాడారు. రంగా ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు.

### ఎస్సీ కులగణన జాబితాల ప్రదర్శన



**సంగం /అనుమసముద్రంపేట/వరికుంటపాడు:** సంగం, అనుమసముద్రం, వరికుంటపాడు మండలాల్లోని గ్రామ సచివాలయాల్లో ఎస్సీ కులగణనకు సంబంధించిన జాబితాలను గురువారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏఎస్‌పేట, సంగం ఎంపీడీఓలు ప్రసన్నకుమారి, షాలెట్ మాట్లాడుతూ ఈ నెల 31 తేదీ వరకు జాబితాలపై అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు తెలిపారు. జనవరి 6 వరకు అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని చెప్పారు. అనంతరం జనవరి 10న తుది జాబితాలను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శిస్తామని తెలిపారు. ఎస్సీలు కులగణన జాబితాలను పరిశీలించి అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. వరికుంటపాడు ఈఓపీఆర్డీ నాగూర్ వలి పాల్గొన్నారు.

## భూసమస్యల పరిష్కారానికి చర్యలు



సంగం: అర్జీదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సోమ్లానాయక్

**వరికుంటపాడు:** భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పీ హేమంత కుమార్ తెలిపారు. మండలంలోని కొండాయపాళెం, ఇరువురు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను గురువారం నిర్వహించారు. తహసీల్దార్ పాల్గొని భూసమస్యలపై అర్జీలను స్వీకరించారు. అసైన్మెంట్, సీజేఎఫ్‌ఎస్ పట్టాలను ఆన్‌లైన్‌లో ఎక్కించాలని, ధర్మవరం గ్రామకంఠం రిజిస్ట్రేషన్ కావడంలేదని, వారసత్వ పట్టా పొలాలు నమోదు, తదితర సమస్యలపై రైతులు అర్జీలు అందజేశారు.

**చేజర్ల:** మండలంలోని ఏటూరు గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సును గురువారం నిర్వహించారు. అండగల్ సవరణలకు 4 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ మురళి తెలిపారు. ఆర్‌ఐ వెంకటేశ్వర్లు, అటవీ శాఖ సిబ్బంది రాజేశ్వరి పాల్గొన్నారు.

**సంగం:** మండలంలోని పడమటిపాళెం గ్రామ సచివాలయంలో తహసీల్దార్ సోమ్లానాయక్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. భూసమస్యలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.

**ఆత్మకూరురూరల్:** మండలంలోని గండ్లవేడు, బొటికర్లపాడు గ్రామాల్లో తహసీల్దార్ సుధీర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రెండు గ్రామాల్లో భూసమస్యలపై ఆరు అర్జీలు అందాయి. సర్పంచ్ మాముడూరు నరసింహులు, మండల సర్వేయర్ రాజా, ఆర్‌ఐ లక్ష్మణ్, వీఆర్వో ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

**సీతారామపురం:** మండలంలోని పోలంగారిపల్లిలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 12 అర్జీలు అందినట్లు తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి తెలిపారు. అర్జీలను పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆర్‌ఐ శ్రీనివాసులు, వీఆర్వో మురళి, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎరువులు అందుబాటులో ఉంచండి



దుత్తలూరు: సోమలరేగడలో వరిపంటను పరిశీలిస్తున్న అధికారులు



సీతారామపురం: రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి

**సీతారామపురం:** రైతులకు అవసరమైన ఎరువులను కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయ అధికారిణి సత్యవాణి వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించారు. మండలంలోని అయ్యవారిపల్లి, దేవిశెట్టిపల్లి గ్రామాల్లో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వరి, మొక్కజొన్న పంటల్లో ఎరువుల యాజమాన్యం, అధిక దిగుబడులు ఇచ్చే వంగడాలు, తెగుళ్లు, వాటి నివారణ చర్యలు, పంటల బీమాపై అవగాహన కల్పించారు. ఏడీఏలు నర్సోజీరావు, శేషగిరి, ఏఓ చెన్నారెడ్డి, ఏఈఓ సాంబశివయ్య, ఏహెచ్‌ఏ శ్వేత, వీఏఏ నరేంద్ర పాల్గొన్నారు.

**వరిలో సస్యరక్షణ చర్యలు కీలకం**

**దుత్తలూరు:** వరిలో సస్యరక్షణ చర్యలు కీలకమని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని సోమలరేగడలో సాగుచేసిన వరిపంటను గురువారం ఆమె పరిశీలించారు. పాముపొడ తెగులును గుర్తించి నివారణకు హెక్సాకోనాజోల్ 2 మి.లీ లేదా ప్రొఫికోనాజోల్ 1 మి.లీ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఏడీఏ నర్సోజీరావు, ఏడీఏ శేషగిరి, ఉదయగిరి ఏడీఏ చెన్నారెడ్డి, ఏఓ ఎన్.వెంకట సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**మర్రిపాడు :** మర్రిపాడు, పల్లవోలు గ్రామాల్లో ఏఓ ఎస్ రామమోహన్ పర్యటించారు. పొగాకు పంటలో లద్దె పురుగు, శనగపచ్చ పురుగును గుర్తించారు. నివారణకు ఏమామెక్టిన్ బెంజోయేట్ మందును ఎకరాకు 100 గ్రాములను నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ ఏడీ గురుజయంతి, ఉద్యాన శాఖ అధికారి రాజశేఖర్, వీఏఏలు లక్ష్మీలహరి, సురేష్, రైతులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

**వరికుంటపాడు:** గ్రామాల్లో క్షయ వ్యాధి లక్షణాలు కలిగిన వారిని వైద్యారోగ్య సిబ్బంది గుర్తించి వైద్య సేవలు అందించాలని సీహెచ్‌ఓ రాజశేఖర్‌రాజు, క్షయ నియంత్రణ సూపర్‌వైజర్ మురళి కోరారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యారోగ్య సిబ్బందితో సెక్టార్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి క్షయ వ్యాధిని గుర్తించాలన్నారు. క్షయను మందుల ద్వారా నయం చేయవచ్చని తెలిపారు. క్షయ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వైద్యారోగ్య శాఖ కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం సాధించాలన్నారు. గర్భిణుల వివరాలను ఆన్‌లైన్ లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటయ్య పాల్గొన్నారు.

## రామాలయ నిర్మాణం పరిశీలన



**వింజమూరు(ఉదయగిరి):** వింజమూరు మండలం శంఖవరం పంచాయతీ పరిధిలోని వెంకటాద్రిపాళెంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం పనులను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గురువారం పరిశీలించారు. రామాలయం శ్లాబ్ నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొందరు గ్రామస్తులు గ్రామంలోని ప్రభుత్వ భూముల క్రయ విక్రయాల విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే అసైన్‌మెంట్ భూములు కొనడం, అమ్మడం చట్టరీత్యా నేరమని, అలాంటివి జరిగి ఉంటే చట్టపరమైన చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలపై ఇప్పటి వరకు 700 అర్జీలు అందాయని, ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.